sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 03-09-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 144 EDITOR: ROHINI



అవినీతిలో బ్యాంకింగ్

కేంద్ర విజిలెన్స్ మైండ్ బ్లోయింగ్ రిపోర్ట్



- లంచాల్లో టాప్ పొజిషన్లో బ్యాంకులు
- దేశంలో రెండో స్థానంలో రైల్వే శాఖ
- గత ఏడాది 70 వేల అవినీతి ఫిర్యాదులు
- బడా బాబుల చేతుల్లో బ్యాంక్ అధికారులు
- విజయ్ మాల్యా, నీరవ్ మోదీలకు అండదండ

దేశాన్ని పట్టి పీడిస్తున్న అవినీతి లీలలు బట్టబయలయ్యాయి. కేంద్ర విజిలెన్స్ కమిషన్ విడుదల చేసిన సరికొత్త నివేదిక ప్రభుత్వ శాఖల బండారాన్ని బట్టబయలు చేసింది. గతేడాది ఏకంగా 70,584 అవినీతి ఫిర్యాదులు రావడం వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. సామాన్యుడి చెమట ఊడ్చి సంపాదించిన సొమ్మును అవినీతిపరులు దోచుకుంటుంటే దేశం ఎలా పురోగమిస్తుంది?

- సహనం వందే, న్యూఢిల్లీ

బ్యాంకుల్లో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో చూస్తే దిమ్మతిరిగిపోతుంది. ఈ మొత్తం అవినీతి లొసుగుల జాబితాలో సామాన్యులతో నిత్యం సంబంధ ఉండే బ్యాంకులు, రైల్వే శాఖలు అగ్రస్థానంలో నిలిచాయి. ఒక్క బ్యాంకింగ్ రంగంలోనే అత్యధికంగా 9993 ఫిర్యాదులు రావడం ఈ వ్యవస్థ ఎంత కలుషితమైందో తెలియజేస్తోంది.

కార్పొరేట్లకు బ్యాంకుల దాసోహం...

పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడంలో కూడా బ్యాంక్ అధికారుల హస్తం కనిపిస్తోంది. ఎటువంటి పూచీకత్తు లేకపోయినా, ఎలాంటి లాభాలు లేకపోయినా కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసి ఆ తర్వాత ఆ కంపెనీలు ఎత్తేస్తే బ్యాంకులు దివాలా తీస్తున్నాయి. ఇక్కడ బ్యాంకు ఉన్నతాధికారులు రాజకీయ నాయకులతో కుమ్మక్కై ప్రజల డిపాజిట్ సొమ్మును నిరర్థక ఆస్తులుగా మారుస్తున్నారు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ లాంటి వారు వేలకోట్లతో దేశాన్ని మోసం చేసి విదేశాలకు పారిపోవడానికి ఇలాంటి అధికారుల లంచగొండితనమే ప్రధాన కారణం. సాధారణ రైతులకు క్రాప్ లోన్స్, చిన్న వ్యాపారస్తులకు ముద్రా రుణాలు ఇవ్వడానికి బ్యాంకు అధికారులు నేరుగా లంచాలు డిమాండ్ చేస్తుంటారు.

రైల్వేల్లో అవినీతి బాగోతం

ఇక బ్యాంకుల తర్వాత భారతీయ రైల్వే శాఖ అవినీతిలో రెండో స్థానంలో నిలిచి విస్మయానికి గురిచేస్తోంది.రైల్వే శాఖకు సంబంధించి ఏకంగా 9381 ఫిర్యాదులు అందాయి. రైల్వేలో ఇంత భారీ స్థాయిలో అవినీతి జరగడం ప్రయాణికులనుతీవ్ర నిరాశకు గురిచేసే అంశం. రైల్వే స్టేషన్లలో ప్ర యాణికులకు రిజర్వేషన్ టికెట్లు దొరకడమే గగనమైపోవడానికి తెరవెనుక పెద్ద ఎత్తున జరిగే మాఫియా దందాలే ప్రధాన కారణం. రైల్వే అధికారుల అండదండలతో దళారులు ప్రయాణికుల టికెట్లను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

స్థానిక సంస్థల లీలలు

ఇక మిగతా శాఖల విషయానికి వస్తే హౌసింగ్,అర్బన్ అఫైర్స్ శాఖపై 6531ఫిర్యాదులు రాగా స్థానిక సంస్థలపై 4834 ఫిర్యాదులు వచ్చాయి.ముఖ్యంగా ఢిల్లీలోని జల్ బోర్డ్,రవాణా శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ వంటి స్థానిక సంస్థలపై కూడా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. అలాగే బొగ్గు రంగంలో 4118, ఫైనాన్స్ రంగంలో 3107 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఢిల్లీ ప్రభుత్వానికి సంబంధించి 2804 ఫిర్యాదులు రాగా పెట్రోలియం మంత్రిత్వ శాఖపై 2722 ఫిర్యాదులు వచ్చాయి.ఇన్సూరెన్స్ కంపెనీలు, టెలికాం రంగం, రక్షణ మంత్రిత్వ శాఖ, ఆహార, ప్రజా పంపిణీ శాఖలలో కూడా వేల సంఖ్యలో ఫిర్యాదులు నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

20 ఏళ్లు గడిచినా శిక్షలు ఏవీ?

విజిలెన్స్ కమిషనే స్వయంగా జోక్యం చేసుకుని చర్యలు తీసుకుంటున్నా కూడా అవినీతి పరుల్లో భయం పుట్టకపోవడం విచారకరం. మరోవైపు సీబీఐ వద్ద 7229 అవినీతి కేసులు ఇంకా విచారణ దశలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే కేవలం 409 కేసులు ఏకంగా 20 ఏళ్లకు పైగా కోర్టుల్లోనే నానుతూ ఉన్నాయి. దోషులకు శిక్ష పడకపోతే ఇక చట్టంపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుందనేది ప్రశ్న. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా లంచగొండితనం మాత్రం వేర్ల నుంచి తొలగిపోవడం లేదు. కేవలం నివేదికలు ఇస్తే సరిపోదు, దోషులను కటకటాల వెనక్కి నెడితేనే మార్పు సాధ్యమవుతుంది.

సౌత్ లీడర్లు సరెండర్ అయ్యారా?

డీలిమిటేషన్ అంశంపై దక్షిణాది మౌనం

- నోరు విప్పని సౌత్ ఇండియన్ సీఎంలు
- తూతూమంత్రంగా దక్షిణాది జోనల్ కౌన్సిల్
- నేతలను దారికి తెచ్చుకుంటున్న కేంద్రం

ఇప్పుడు దక్షిణాది రాజకీయాలను అత్యంత తీవ్రంగా కలవరపెడుతున్న ప్రధాన అంశం లోక్‌సభ సీట్ల పునర్విభజన. దక్షిణాది నాయకులు ఈ విషయంలో కలిసికట్టుగా మాట్లాడలేకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఉత్తరాది హవా ముందు మన రాష్ట్రాల నాయకులు పూర్తిగా చేతులెత్తేస్తున్నారు. జాతీయ స్థాయిలో మన గొంతు రోజురోజుకూ బలహీనపడిపోతోంది. - సహనం వందే, హైదరాబాద్

ఇటీవల తమిళనాడులో జరిగిన దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మినహా మిగతా రాష్ట్రాల నుంచి వచ్చిన ముఖ్యమంత్రులు తీవ్ర స్థాయిలో తమ గళాన్ని విప్పలేదన్న విమర్శలు ఉన్నాయి. శివకుమార్ మాత్రం 1971 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్‌ను మరో 25 ఏళ్ల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాల సంఖ్య అలాగే ఉంచాలని ఆయన కోరారు. కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఈ విషయంలో కేవలం మొక్కుబడి మాటలతో సరిపెట్టారనే అభిప్రాయం వ్యక్తమైంది.

మారిన నేతల వైఖరి...

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ గతంలో ఈ డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, రానురాను తన పద్ధతిని మార్చుకుని రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చూసుకోవాలని కోరడానికే పరిమితమయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కీలకమైన సమావేశానికి హాజరుకాకుండా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పంపడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమిలో భాగస్వాములుగా ఉన్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కూడా ఇప్పుడు జాతీయ స్థాయిలో తమ రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం పాటిస్తున్నారనే చర్చ జరుగుతుంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను దారికి తెచ్చుకోవడానికి కేంద్రం అనుసరిస్తున్న వ్యూహాలు దక్షిణాది గళాన్ని క్రమంగా నొక్కివేస్తున్నాయి.

చరిత్రలో ఉత్తరాది హవా

స్వాతంత్ర ఉద్యమ కాలం నుంచి చూస్తే ఉత్తర, పశ్చిమ, తూర్పు ప్రాంతాల నాయకులదే జాతీయ స్థాయిలో హవా నడిచింది. కానీ దక్షిణాది ప్రాంతం మాత్రం జాతీయ రాజకీయాల్లో తన గళాన్ని పూర్తిగా వినిపించలేకపోయామనే ఆవేదన ప్రజల్లో ఉంది. గాంధీ, నెహ్రూ, నేతాజీ, పటేల్ వంటి దిగ్గజాలు ఉత్తరాది నుంచి రాగా, దక్షిణాది నుంచి రాజాజీ, టంగుటూరి ప్రకాశం, ఈఎంఎస్ నంబూద్రిపాద్ లాంటి గొప్ప నేతలు ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో ఆ స్థాయి గుర్తింపు దక్కలేదు. అప్పట్లో దక్షిణాదిలో జరిగిన అనే ఉద్యమాలు, ముఖ్యంగా ఉత్తరాది ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు జాతీయ స్థాయిలో పెద్దగా చర్చకు రాలేదు.

హిందీ భావజాలం నీడలో వెనుకడుగు...

నెహ్రూ-గాంధీ కుటుంబం రాజకీయ ఆధిపత్యం, హిందీ భావజాలం దక్షిణాది నాయకత్వాన్ని ఎప్పుడూ నీడలా కమ్ముకుంటూనే వచ్చాయి. బీజేపీలో కూడా హిందీ మాట్లాడే రాష్ట్రాల నాయకులదే పైచేయిగా ఉండటం వల్ల దక్షిణాది రాజకీయ నాయకులు వెనుకబడాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ కూడా దక్షిణాదిలో కామరాజ్, సి. సుబ్రమణ్యం, నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానంద రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, ఎన్. జయరామారెడ్డి, ఎస్. నిజలింగప్ప, దేవరాజ్ ఉర్స్, ఎస్.ఎం. కృష్ణ, ఈఎంఎస్ నంబూద్రిపాద్ వంటి శక్తివంతమైన ప్రాంతీయ నాయకులను తయారుచేసింది.

ప్రాంతీయ పార్టీలకే పరిమితమైన రాజకీయం...

జాతీయ రాజకీయాల్లో ఎవరైనా దక్షిణాది నేతలు తమ ముద్ర వేయగలిగితే, అది కేవలం ప్రాంతీయ పార్టీల ద్వారా లేదా ప్రత్యేకమైన ప్రాంతీయ ప్రాబల్యం ఉన్న జాతీయ పార్టీల ద్వారానే సాధ్యమైంది. తమిళనాడులో ఎం.జి. రామచంద్రన్, జయలలిత, కేరళలో నంబూద్రిపాద్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి. రామారావు, తెలంగాణలో కె. చంద్రశేఖర రావు, కర్ణాటకలో హెచ్.డి. దేవెగౌడ, రామకృష్ణ హెగ్డే, సిద్ధరామయ్య వంటి నాయకులు ప్రాంతీయ స్థాయిలోనే తమ రాజకీయ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. జాతీయ పార్టీలు దక్షిణాది నాయకులకు ఒక ప్రాంతీయ గుర్తింపు ఇవ్వడానికి మాత్రమే పరిమితమయ్యాయి తప్ప జాతీయ స్థాయిలో చక్రం తిప్పే అవకాశం ఇవ్వలేదు.

నేపాల్ వీధుల్లో సూద్ అడుగులు!

వరద బాధితులకు సోను సూద్ అభయం

- సరిహద్దులు దాటి సేవలందిస్తున్న నటుడు
- బాధితుల గుండెల్లో దేవుడైన రియల్ హీరో
- ఇండియా నుంచి ఆహారం, దుప్పట్ల సాయం

కష్టమొచ్చినప్పుడు సరిహద్దులు లెక్కచేయకుండా ముందుకెళ్లే అసలు సిసలు రియల్ హీరో సోనూసూద్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. నేపాల్ దేశాన్ని వణికించిన భయంకరమైన వరద విలయంలో సర్వస్వం కోల్పోయిన ప్రజల రోదనలకు చలించిపోయి స్వయంగా రంగంలోకి దిగి అక్కడి బాధితులకు అండగా నిలుస్తున్నారు.

- సహనం వందే, నేపాల్

కోవిడ్ సమయంలో దేశవ్యాప్తంగా వలస కార్మికులకు దేవుడిగా నిలిచిన నటుడు సోనూసూద్... ఇప్పుడు సరిహద్దులు దాటి పక్కనే ఉన్న నేపాల్ దేశంలోని వరద బాధితుల కోసం అడుగులు వేశారు. తన సూద్ ఛారిటీ ఫౌండేషన్ బృందంతో కలిసి నేరుగా నేపాల్ రాజధాని ఖాట్మాండు చేరుకున్నారు. 'నేపాల్ ప్రజలారా మీరు ఒంటరిగా లేరు, మేము ఆహారం, ఆశ్రయం కల్పిస్తాం. మిమ్మల్ని మళ్లీ నిలబెట్టేందుకు వస్తున్నామని' ఆయన ముందే ప్రకటించి ఇప్పుడు చేతల్లో చేసి చూపిస్తున్నారు. ఖాట్మాండు చేరుకున్న వెంటనే వరద బాధితులను కలిసి వారిని ఓదార్చడంతో పాటు వారి జీవితాలను మళ్లీ గాడిలో పెట్టేందుకు తాను ముందుంటానని భరోసా ఇచ్చారు.

భారీగా తరలివస్తున్న సహాయక సామగ్రి

ప్రస్తుతానికైతే అక్కడి బాధితుల తక్షణ అవసరాలను తీర్చడానికి సోనూసూద్ ఫౌండేషన్ పెద్ద ఎత్తున రంగంలోకి దిగింది. భారత్ నుంచి ప్రత్యేకంగా వేల సంఖ్యలో దుప్పట్లు, ఆహార పదార్థాలను నేపాల్‌కు తరలించారు. అక్కడి గ్రౌండ్ రియాల్టీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ స్థానిక ప్రజలకు అసలు ఏది అవసరమో తెలుసుకుని మరీ సాయం అందిస్తున్నారు. కేవలం ఒకరిద్దరితో కాకుండా పెద్ద బృందంతో వెళ్లి అక్కడి క్షతగాత్రులను, బాధితులను పరామర్శించడం విశేషం. నేపాల్‌లో చిన్నపిల్లలు తమ ఇళ్లను, కుటుంబాలను, బాల్యాన్ని కోల్పోయి రోడ్డున పడిన దృశ్యాలు తనను ఎంతగానో కలిచివేశాయని సోనూసూద్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలతో కలిసి దిగిన ఫోటోలను షేర్ చేస్తూ వారందరికీ ఒక కొత్త జీవితాన్ని అందించడానికి తాము కలిసికట్టుగా కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

భవిష్యత్తులోనూ నిరంతరం సేవలు

ఈ సహాయ కార్యక్రమాలు కేవలం కొన్ని రోజులకే పరిమితం కావని సోనూసూద్ స్పష్టం చేశారు. కేవలం ఈ నెల మాత్రమే కాకుండా రాబోయే నెలల్లో కూడా నేపాల్‌కు నిరంతరం సహాయం అందుతూనే ఉండేలా ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. ఎక్కడెక్కడి నుంచో అవసరమైన సామగ్రిని సేకరించి భారత్ నుంచి ఎప్పటికప్పుడు నేపాల్‌కు పంపిస్తున్నామని తెలిపారు. బాధితులు పూర్తిగా కోలుకుని తమ సొంత కాళ్లపై నిలబడే వరకు తమ సహాయం ఆగదని ఆయన చెప్పారు.

సేవా కార్యక్రమాల్లో నిలువెత్తు రూపం...

సోనూసూద్ ఇలాంటి సేవా కార్యక్రమాలను చేయడం ఇదేం మొదటిసారి కాదు. గతంలో కరోనా మహమ్మారి సమయంలోనూ... ఆ తర్వాత పంజాబ్ వరదల సమయంలోనూ, అలాగే ఈ ఏడాది మార్చిలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల దుబాయ్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఉచిత వసతి కల్పించి తన పెద్ద మనసును చాటుకున్నారు. కులం, మతం, దేశం అనే తేడా లేకుండా సాయం చేయడమే అసలైన మానవత్వం అని ఆయన చేతల్లో చేసి చూపుతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.